క్లుప్తంగా

దేశాభివృద్ధికి రాజ్యాంగమే పునాది



అవార్డులు ప్రదానం చేస్తున్న ప్రజాసాహితీ సభ్యులు

ఐ.పోలవరం: భారతదేశ సర్వతోముఖాభివృద్ధికి రాజ్యాంగమే పునాది అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ ప్రజాసాహితీ నాలుగో వార్షికోత్సవం సోమవారంతో ముగిసింది. పశువుల్లంకలో రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమాల్లో రాజ్యాంగంపై సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన భారతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అవగాహన చేసుకునే కొద్ది ప్రజాస్వామ్యం, మానవ హక్కుల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఎం.రుషి, జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణలకు సెక్యులర్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరావు, ఎస్.ఎన్.మునీశ్వరరావు, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వీరభద్రుని ఊరేగింపులు



ఉప్పలగుప్తంలో వీరభద్రుడిని ఊరేగిస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని గొల్లవిల్లి, ఉప్పలగుప్తం, ఎస్.కొత్తపల్లి, భీమనపల్లి గ్రామాల్లో సోమవారం వీరభద్రుని ఊరేగింపులు ఘనంగా జరిగాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి బోనాలు సమర్పించుకుని, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఊరేగింపులలో నృత్య కళాకారుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేతనాలు పెంచాలని కోరుతూ వినతి

ముమ్మిడివరం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు కార్మికుల సంఘం నాయకుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు సోమవారం వినతి పత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులకు ప్రస్తుతం రూ.3 వేలు ఇస్తున్నారని, దాన్ని రూ.15 వేలకు పెంచాలని కోరారు. కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రావిడెండ్ ఫండ్, ప్రమాద బీమా పథకం వర్తింపచేయాలని అడిగారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆకుల వెంకటలక్ష్మి, నల్లి సుమతి, ఖండవిల్లి విజయలక్ష్మి, అడబాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి విశ్వరూప్ తదితరులు

ముమ్మిడివరం: గ్రామీణ ప్రాంతాల్లో మల్టీస్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకురావడం శుభ పరిణామమని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ముమ్మిడివరంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంజీరా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ గ్యాస్ట్రిక్, క్యాన్సర్, లివర్ సర్జరీ వంటి మెరుగైన సేవలు ముమ్మిడివరంలో అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవాని, ఆసుపత్రి వైద్యులు డా.సుధీర్, డా.మంజీరా తదితరులు పాల్గొన్నారు.

సూర్యోదయ యోజనతో ఎంతో మేలు

యానాం: ప్రధానమంత్రి సూర్యోదయ యోజనలో రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్లను ఏర్పాటుచేసుకుంటే పేద, మధ్యతరగతి వర్గాలకు 300 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ లభిస్తుందని విద్యుత్ శాఖ ఏఈ లంక కృష్ణారావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో భాగమవ్వాలనుకునేవారు ముందుగా 'పీఎం సూర్యఘర్.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గిండమే లక్ష్యంగా సౌరవిద్యుత్‌ను అందరికీ చేరువ చేయాలన్నది ఈ పథకం ఉద్దేశమన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌లో ఇంటి అవసరాలకు పోను మిగతాది డిస్కంలకు అమ్ముకోవచ్చన్నారు.

అతివకు ఆర్థిక స్వావలంబన

- వైఎస్సార్ చేయూత పథకంతో మహిళలకు ఏటా రూ.18,750 లబ్ధి
- మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వ సాయం



ఉప్పూడిలో వైఎస్సార్ చేయూత లబ్ధితో పాడి గేదెలను పెంచుకుంటున్న మహిళా రైతు

కాట్రేనికోన: మహిళల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని తూచా తప్పకుండా పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 45 ఏళ్లు నిండిన మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 ఆర్థిక సాయం అందజేస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఇప్పటికే మూడు విడతల సాయంగా ప్రతి మహిళకు రూ.56,250 అందజేశారు. ఈ నెల 24వ తేదీన నాలుగో విడత సాయం సొమ్మును మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. మొత్తంగా నాలుగు విడతల్లో కలిపి ప్రతి లబ్ధిదారుకు రూ.75,000 సాయం అందుతుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సాయంతో చిరు వ్యాపారాలు

వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ప్రభుత్వం ఏటా రూ.18,750 అందిస్తుండడంతో మహిళలు స్వశక్తిపై ఎదిగేందుకు, సుస్థిరమైన జీవనోపాధి పొందేందుకు ఆస్కారమేర్పడింది. వైఎస్సార్ చేయూతతో పాటు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కిరాణా, ఫ్యాన్సీ, గేదెలు, ఆవుల పెంపకం, పాల డెయిరీ, వస్త్ర దుకాణాల ఏర్పాటు, పండ్లు, కూరగాయల దుకాణాలు వంటి వ్యాపారాలు చేసుకుంటున్నారు. తద్వారా మహిళలు తమ కుటుంబ ఆదాయం పెంచుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గతంలో చిరు వ్యాపారాలు చేసేందుకు కూడా అప్పుల కోసం బయట అధిక వడ్డీలకు తీసుకోవాల్సి వచ్చేదని, సీఎం జగన్ దయ వల్ల వైఎస్సార్ చేయూత పథకం ద్వారా తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నామని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలో చేయూత పథకం లబ్ధి వివరాలు

మండలం	లబ్ధిదారులు	నాలుగో విడత సాయం (రూ.కోట్లలో)
కాట్రేనికోన	4,825	9.04
ఐ.పోలవరం	3,557	6.66
తాళ్లరేవు	5,158	9.67
ముమ్మిడివరం	2,491	4.67
ముమ్మిడివరం నగర పంచాయతీ	1,500	2.81



ప్రభుత్వ సాయంతో పి.లక్ష్మివాడలో బట్టల వ్యాపారం చేసుకుంటున్న మహిళ

పాల వ్యాపారం చేస్తున్నాను



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ప్రభుత్వం ఏటా రూ.18,750 చొప్పున సాయం అందిస్తుంది. దీనికి తోడు బ్యాంకు రుణం మరో రూ.56,250లు కలిపి పాడి గేదెలను కొనుగోలు చేశాను. పాల వ్యాపారం చేసి వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. జగనన్నకు రుణపడి ఉంటాం.

– పెయ్యల కనకదుర్గ, ఉప్పూడి

'చేయూత'తో వ్యాపారం



వైఎస్సార్ చేయూత లబ్ధితో చేనేత మగ్గాలపై చీరలకు అవసరమైన దారాల నేతతో పాటు చేనేత చీరల వ్యాపారం చేస్తున్నాను. ప్రభుత్వం అందించిన వైఎస్సార్ చేయూత ఆర్థిక సహాయం, బ్యాంకు రుణం వ్యాపార అభివృద్ధికి ఎంతగానో దోహదపడింది. మా పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవడానికి ఆస్కారమేర్పడింది.

– గుమ్మడి పద్మాక్షి, లక్ష్మివాడ

నేడు కాలభైరవస్వామి తీర్థం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో కొలువై ఉన్న కాలభైరవస్వామి తీర్థ మహోత్సవం మంగళవారం జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన నిర్వహించే స్వామివారి తీర్థ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారు. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణానికి ఏర్పాట్లు

తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో 24వ తేదీ వరకూ జరగనున్న కల్యాణ మహోత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సబ్ రిజిస్ట్రార్ లేక నిలిచిన రిజిస్ట్రేషన్లు

యానాం: స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గత కొన్ని నెలలుగా సబ్ రిజిస్ట్రార్ లేకపోవడం వల్ల రిజిస్ట్రేషన్లకు ఆటంకం కలుగుతుందని సోమవారం పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ స్థానంలో డిప్యూటీ తహసీల్దార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా ఆయన సెలవులో ఉన్నారని, ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన సబ్‌రిజిస్ట్రార్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

జిప్‌మెర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్ సమీక్ష



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పుదుచ్చేరి జిప్‌మెర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్

యానాం: పట్టణంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన జిప్‌మెర్ ఆసుపత్రిని ప్రధాని మోడీ ఈ నెల 25న వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం పుదుచ్చేరి జిప్‌మెర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్, డిప్యూటీ డైరెక్టర్ కృష్ణ గోపాల్ గోయల్ యానాం విచ్చేశారు. జిప్‌మెర్ ఆసుపత్రిలోని సమావేశ గదిలో జిప్‌మెర్ సిబ్బంది, ఇన్‌చార్జి రీజినల్ అడ్మినిస్ట్రేటర్ టి.రవిశంకర్, సీఐ షణ్ముగం తదితరులతో ప్రారంభ ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు గురించి సమీక్షించారు. ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద్‌రాజ్, సూపరింటిండెంట్ దిలీప్‌మౌర్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: స్థానిక బైపాస్ రహదారిలో వేంచేసియున్న శ్రీధర్మ శాస్తా అయ్యప్పస్వామివారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచి 8.30 గంటల వరకు స్వామివారికి పంచామృతాభిషేకాలు, మండపారాధన, లక్ష్మీగణపతి హోమం చేశారు. అనంతరం భక్తులు స్వామివారి గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి పడిపూజ, పుష్పయాగం నిర్వహించారు.

వెంకన్న ఆలయానికి జనరేటర్ బహూకరణ



వేంకటేశ్వరస్వామి ఆలయానికి సమకూర్చిన జనరేటర్‌ను అందజేస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండు కుటుంబాలకు చెందిన దాతలు రూ.12 లక్షల విలువైన 125 కేవీ జనరేటర్‌ను సోమవారం బహూకరించారు. సత్యనారాయణ టెంట్ హౌస్ గ్రూపునకు చెందిన రాకుర్తి నారాయణ, మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు, మద్దింశెట్టి నాగేశ్వరరావు కుటుంబీకులు కలిసి జనరేటర్‌ను సమకూర్చారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవికి జనరేటర్‌ను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, అమలాపురం సత్యనారాయణ టెంట్ హౌస్, సత్యనారాయణ గార్డెన్స్ అధినేతలు రాకుర్తి సత్యనారాయణ సోదరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



అమలాపురం డిపోలో డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో అధికారులు

అమలాపురం రూరల్: హెవీ డ్రైవింగ్ చేసే వాహన చోదకులు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్లో 8వ బ్యాచ్ డ్రైవింగ్ శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రవికుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందే అభ్యర్థులంతా డ్రైవింగ్‌కి సంబంధించిన మెళకువలు తెలుసుకుని, నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రజాక్, పీఓ ఎన్‌వై ప్రసాద్, ఓపీఆర్ఎస్ సిస్టమ్ ఇన్‌చార్జ్ ఉన్ వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబ్బాయి విగ్రహావిష్కరణకు సన్నాహాలు



చిట్టిబ్బాయి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: పట్టణంలోని గడియారం స్తంభం సెంటరు సమీపంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత కుడుపూడి చిట్టిబ్బాయి విగ్రహావిష్కరణకు నియోజకర్గ వైఎస్సార్ సీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. చిట్టిబ్బాయి విగ్రహాన్ని నెలకొల్పే ప్రదేశాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణపై మంత్రి విశ్వరూప్ పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. మంత్రి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెద బాబు, గొవ్వాల రాజేష్ తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం



తాటిపాకలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాల్

రాజోలు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసి పండించిన ఉత్పత్తులను సోమ వారం తాటిపాక పెద్దవంతెన వద్ద అమ్మకాల స్టాల్‌ను సర్పంచ్ కోటిపల్లి రత్నమాల ప్రారంభించారు. ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, మిల్లెట్స్, బెల్లం, చింతపండు, పప్పు ధాన్యాలను విక్రయించారు. ఏఓ శ్రీనివాస్, మార్కెటింగ్ ఎస్ఎఫ్ఏ అనంతకుమార్, ఎంటీ జోసెఫ్ మల్లిక, వీఏఏలు సాయి, రామసీత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- ఆర్బీకే, సచివాలయ భవనాల ప్రారంభం



ఈదరపల్లిలో సచివాలయ భవనాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేసి మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం ఈదరపల్లిలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం-1, రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం-2, రూ.23.94 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాలను ఆయన ప్రారంభించారు. ఈదరపల్లి అంబేడ్కర్‌నగర్‌లో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వన్నె చింతలపూడిలో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను మరింత వేగంగా, పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజలకు అందించేందుకు తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు సొంత గ్రామంలోనే సకల సేవలు అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి ఈ ఐదేళ్లలో కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, పంచాయతీరాజ్ డీఈఈ రాజ్‌కుమార్, ఏఈ రాధాకృష్ణ, సర్పంచ్‌లు రాయుడు వరలక్ష్మి, నక్కా రాజారత్న నాగవేణి, వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం, పాలమూరి బాలకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, జిల్లా కార్యదర్శి జంపన రమేష్‌రాజు, ఎంపీటీసీ పరమట నాగమణి, డాక్టర్ శ్రీకాంత్, సొసైటీ అధ్యక్షుడు అడపా బాబులు పాల్గొన్నారు.

ఘనంగా తిళ్లాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



తిళ్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఐ.పోలవరం: మండలంలోని తిళ్లకుప్ప గ్రామంలో వేంచేసిన తిళ్లాలమ్మ అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని శని, ఆది, సోమవారాల్లో ఆలయ ఆవరణలో వివిధ రకాల పూజలు, హోమాలు నిర్వహించారు. కేశనకుర్రుపాలెం గ్రామానికి చెందిన సువర్ణసింహతలాట సన్మాన గ్రహీత కాళ్లకూరి కామేశ్వర శర్మ, ముక్కామలకు చెందిన శైవాగమ పండితులు వెలవలపల్లి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో పలువురు పండితులచే యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు, నిత్య హోమాలు, పూర్ణాహుతి, అమ్మవారి దర్శనాలు, పండిత ఆశీర్వచనం జరిపారు. తిళ్లాలమ్మ అమ్మవారిని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, చిక్కాల రామచంద్రరావు తదితరులు దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మూడు రోజుల పాటు భారీ అన్న సమారాధన జరిగింది.

రాష్ట్ర స్థాయి షటిల్ పోటీల్లో పతకాలు



పతకాలు, బహుమతులు అందుకుంటున్న విజేతలు

యానాం: రాజమహేంద్రవరం ఆర్ఎంసీ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకూ నిర్వహించిన రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నమెంట్‌లో యానాం క్రీడాకారుడు పట్టా రామకృష్ణ, మరో క్రీడాకారుడు రామ్మోహన్‌రావుతో కలిసి విజేతగా నిలిచారు. 40 ఏళ్లు పైబడిన వారికి నిర్వహించిన ఈ పోటీల్లో ఇద్దరూ బంగారు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విజేతలకు బంగారు పతకాలను, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ద్వారకానాథ్, పి.అంకమ్‌చౌదరి పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడిపై నిరసన



సాగునీరు అందించాలని నిరసన చేపట్టిన రైతులు

యానాం: దరియాలతిప్ప ఆయకట్టు పరిధిలోని శివారు పంట పొలాలకు సాగునీరందక తమ పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని పలువురు రైతులు సోమవారం స్థానిక ఆర్‌పీఏ ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీటి ఇబ్బందులపై స్థానిక పీడబ్ల్యూడీ యంత్రాంగం దృష్టి సారించకపోవడం వల్లే ఏటా తాగునీటి ఎద్దడి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి పంట పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు కోరుకొండ బాలయోగి, సబ్బతి శ్రీనివాసు, ఆనందరావు, గిడ్ల వెంకన్న, బస్వా మాణిక్యాలు పాల్గొన్నారు.

ఘనంగా వీరన్నబాబు సంబరం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో వేంచేసియున్న వీరన్నబాబు ఆలయంలో సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు స్వామివారిని గ్రామంలో సంప్రదాయబద్ధంగా ఊరేగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులందరికీ ఉచిత ప్రసాదాలు పంచారు. 75 ఏళ్లుగా పాత బండారులంక వీరన్నబాబు సెంటర్‌లో సంబరం నిర్వహిస్తున్న అర్లపల్లి అమ్మన్నను భక్తులు సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, చింతా శంకరమూర్తి స్వామిని దర్శించుకున్నారు.

లెఫ్టినెంట్ గవర్నర్‌గా మూడేళ్లు

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా తమిళిసై సౌందరాజన్‌కు మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం రంగసామి సోమవారం రాజ్‌నివాస్‌కు వెళ్లి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రంగసామి ఎల్జీ తమిళిసైకు దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అంబాజీపేట: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.విమలకుమారి సోమవారం పరిశీలించారు. వక్కలంక, మొసలపల్లి, ఇరుసుమండ గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, బీఎల్వోలు తహసీల్దార్ వెంట ఉన్నారు.

పట్టాలు ఇప్పించాలంటూ కలెక్టర్‌కు అర్జీ

ఉప్పలగుప్తం: తమ గ్రామంలోనే ఎకరాల మేర ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉందని, దాన్ని ఇళ్ల పట్టాలుగా చేసి తమకు అందించాలని సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు విలసవిల్లి గ్రామస్తులు వినతి పత్రం అందించారు. తమకు పక్క గ్రామంలో ఇళ్ల స్థలాలిచ్చారని, కాని తమ గ్రామంలోనే అధిక శాతం ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉందన్నారు. ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని తమకు ఇళ్ల పట్టాలివ్వాలని విలసవిల్లి గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు.

నేడు విశ్వేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట: మాచవరం శివారు కోటివారి అగ్రహారంలో కొలువుదీరిన భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణ వేడుకలను మంగళవారం రాత్రి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అంకురారోహణ, ధ్వజారోహణ, స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈనెల 21 మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నామన్నారు.